# 'హరిత' సన్నద్ధత



రాజుగూడ నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

- పదో విడుత హరితహారానికి కార్యాచరణ
- ప్రతి జీపీలోని నర్సరీలో మొక్కలు సిద్ధం
- దండేపల్లి మండలంలో 1.90 లక్షలు నాటడమే లక్ష్యం
- జూలై మొదటి వారంలో పంపిణీకి ఏర్పాట్లు



మాకులపేట నర్సరీలో మొక్కలకు గ్రీన్ నెట్ ఏర్పాటు చేసిన సిబ్బంది

దండేపల్లి, మే 22 : 'తెలంగాణ పచ్చని వనం కావాలి. ప్రతి ఊరిలో పచ్చందాలు నిండాలి. ప్రతి ఇల్లూ మొక్కల పొదరిల్లు కావాలి' అనే సంకల్పంతో తొమ్మిదేండ్ల క్రితం కేసీఆర్ సర్కారు హరితహారం పథకాన్ని ప్రారంభించగా, అద్భుతమైన ఫలితాలు సాధించింది. కోట్లాది మొక్కలు నాటి విప్లవాత్మక మార్పుతీసుకొచ్చింది. తొమ్మిది విడుతలు విజయవంతం కాగా, ప్రస్తుతం పదో దశకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నది.

### లక్ష్యం 1.90 లక్షలు..

ఈ యేడాది దండేపల్లి మండలంలో 1.90 లక్షల మొక్కలు నాటేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జూలైలో చేపట్టే హరితహారం కార్యక్రమానికి మొక్కలు అందించేందుకు అన్ని సిద్ధం చేస్తున్నారు. 31 గ్రామ పంచాయతీల్లో.. పంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీ ఏర్పాటు చేసి, ఒక్కో నర్సరీలో 5 వేల చొప్పున 1.55 లక్షల మొక్కలు పెంచుతున్నారు. ప్రజల ఆసక్తి మేరకు చింత, వేప, కృష్ణతులసి, బొప్పాయి, మునగ, మందారం, మల్లె, కానుగ తదితర పండ్లు, పూల మొక్కలు పెంచుతున్నారు. ప్రతి జీపీలో సేవకుడిని నియమించి మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించారు. పశువుల నుంచి కాపాడేందుకు నర్సరీల చుట్టూ కంచె ఏర్పాటు చేశారు.

### జీపీలకే నిర్వహణ బాధ్యతలు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంఎన్ఆర్ఈజీఎస్)ఆధ్వర్యంలో గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యత పంచాయతీలకు అప్పగించారు. నర్సరీ స్థలాల ఎంపిక, విత్తనాలు నాటడం, పెంపకం లక్ష్యం పూర్తిగా ఈ పథకం అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతుంది. నిధులు కూడా ఉపాధిహామీ నుంచే కేటాయిస్తున్నారు. ఒక్కో నర్సరీలో మొక్కలు పెంచేందుకు ప్రభుత్వం లక్షల మేర ఖర్చు చేస్తున్నది. నర్సరీల్లో మొక్కలు బతికేలా పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

### పదో విడుతకు సిద్ధంగా ఉన్నాం..

పదో విడుత హరితహారానికి సిద్ధంగా ఉన్నాం. 31 జీపీల్లో ఈజీఎస్ ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నాం. ప్రతి రోజూ నర్సరీలకు వెళ్లి పర్యవేక్షిస్తున్నాం. ప్రజలు కోరుకునే మొక్కలు పెంచుతున్నాం. ప్రతి ఇంటికి ఆరు చొప్పున మొక్కలు పంపిణీ చేస్తాం. అలాగే రైతులు పొలం గట్లపై నాటేందుకు టేకు మొక్కలు ఇస్తాం.

-దుర్గాదాస్, ఈజీఎస్ ఏపీవో, దండేపల్లి

## పోరాటాలకు సిద్ధంగా ఉండాలి



ఆర్కే 5గనిపైన మాట్లాడుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

- కార్మికులకు గనులపై మౌలిక వసతులు మెరుగు పరచాలి
- ఆర్కే 5 గనిపై ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారాయ్య

శ్రీరాంపూర్, మే 22 : సింగరేణి వ్యాప్తంగా కార్మికుల పరిష్కారానికి కార్మికులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య పిలుపునిచ్చారు. బుధవారం శ్రీరాంపూర్ ఆర్కే 5గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గనులపై కార్మికులకు మౌలిక వసతులు మెరుగు పర్చాలని కోరారు. కార్మికులకు గనులపై రెస్టాల్స్, బోజనశాలలు, సైకిల్ షెడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సీఎంపీఎఫ్ లోన్ క్లైమ్‌లు వెంటనే పరిష్కరించాలన్నారు. సంస్థలో కాలం చెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలు తొలగించి వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేసి నడిపించాలని డిమాండ్ చేశారు. యంత్రాల్లో నాసిరకం ఆయిల్ వినియోగించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సహాయ కార్యదరిశ కొమురయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాదరెడ్డి, బద్రి బుచ్చయ్య, ఫిట్ కార్యదర్శులు గుణిగంటి నర్సింగరావు, మురళీచౌదరి, సంఘం సదానందం, రాంచందర్, రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకుల సత్తిరెడ్డి, విశ్వనధరెడ్డి, బోగ మదునయ్య, రమణ పాల్గొన్నారు.

## రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

**శ్రీరాంపూర్ ఓసీపీ, ఇందారం ఓపెన్ కాస్ట్‌ను సందర్శించిన సింగరేణి డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి**



శ్రీరాంపూర్ ఓసీపీ క్వారీని పరిశీలిస్తున్న డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్/జైపూర్, మే 22 : వర్షాకాలంలో రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సింగరేణి ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. బుధవారం శ్రీరాంపూర్ ఓసీపీ క్వారీని, ఇందారం ఓపెన్ కాస్టును శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డితో కలిసి సందర్శించారు. ఉపరితల గనిలో వ్యూపాయింట్ నుంచి గని పని ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓసీపీల్లో ఉత్పత్తి, రవాణాకు ఆటంకం కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఓసీపీ గనులపై నిల్వ ఉన్న బొగ్గును రవాణా చేయాలన్నారు. ఉత్పత్తికి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీ మట్టి తవ్వకాల (ఓబీ) కాంట్రాక్టు సంస్థకు జీవీఆర్, సీవీఆర్ నిర్వాహకులు రోజువారి మట్టి త్వకాలు, రవాణా పూర్తి చేయాలని ఆదేశించారు. మట్టి ఎంత తరలిస్తామో, అంత బొగ్గు ఎక్కువగా ఉత్పత్తి చేయగలుగుతామన్నారు. ఇక్కడ పీవోఎం శ్రీనివాస్, మేనేజర్ రవికుమార్, బ్రహ్మాజీ, సర్వే ఆఫీసర్ సంపత్ పాల్గొన్నారు.

## దళిత బాలికల విద్యకు కృషి చేసిన భాగ్యరెడ్డి వర్మ



నివాళులర్పిస్తున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు

నస్పూర్, మే 22 : దళిత వైతాళికుడు, సంఘ సంస్కర్త అయిన భాగ్యరెడ్డి వర్మ దళిత బాలికల విద్యకు ఎంతో కృషి చేశారని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలకు అదనపు కలెక్టర్ మోతీలాల్, షెడ్యూల్డు కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు పోటు రవీందర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ దళిత బాలికల కోసం 26 పాఠశాలలను స్థాపించిన గొప్ప వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో అనిత, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, పర్యవేక్షకుడు సంతోష్ పాల్గొన్నారు.

## సెప్టిక్ ట్యాంక్‌కు మరమ్మతులు చేయండి

శ్రీరాంపూర్, మే 22 : శ్రీరాంపూర్ ఆర్కే 8కాలనీ డిస్పెన్సరీ సమీపంలోని సింగరేణి సులబ్ కాంప్లెక్స్ నం. 2 సెప్టిక్‌ట్యాంక్ చాం బర్స్ పగిలి అందులో నుంచి కక్కూస్ నీరు లీకు అయి దరువాసన వస్తుంది. దీంతో సమీప నివాసులు దుర్గందంతో ఇబ్బంది పడుతున్నారు. కార్మిక కుటుంబాలు సింగరేణి యాజమాన్యానికి, మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించు కోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దురువాసనతో అనారోగ్యాలకు గురవుతున్న కార్మిక కుటుంబాలను యాజమాన్యం సెప్టిక్ ట్యాంకుకు మరమ్మతులు చేయించి కాపాడాలని కోరుతున్నారు.

## ముగిసిన వేసవి క్రీడా శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న డీవైజీఎం అరవిందరావు

శ్రీరాంపూర్, మే 22 : సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన వేసవి కాల క్రీడల శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాంపూర్ డీవైజీఎం(పర్సనల్) అరవిందరావు పేర్కొన్నారు. బుధవారం ప్రగతీ స్టేడియంలో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్, గేమ్స్ అసోసియేషన్ (డబ్ల్యూపీఎస్‌జీఏ)ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి కాల క్రీడల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో డీవైజీఎం అరవిందరావు, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదాలు పాల్గొని శిక్షణ పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యం క్రీడా సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. సింగరేణి వ్యాప్తంగా అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, బాక్సింగ్ క్రీడల్లో నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూపీఎస్‌జీఏ డీవైపీఎం పాల్ సృజన్, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ తోట సురేశ్, కోచ్ రమేశ్ పాల్గొన్నారు.

## పర్సనల్ రికార్డ్స్ డిజిటలైజేషన్ చేయాలి

**డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి**



వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న డైరెక్టర్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్, మే 22 : సింగరేణి ఉద్యోగుల పర్సనల్ రికార్డ్స్ డిజిటలైజేషన్ చేయాలని అధికారులను డైరెక్టర్లు ఆదేశించారు. బుధవారం శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ నుంచి డైరెక్టర్ (ఆపరేషన్) ఎన్‌వీకే శ్రీనివాసరావు, డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డిలు సింగరేణి పర్సనల్, ఎస్టేట్, ఫైనాన్స్ ఉన్నతాధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సింగరేణి పర్సనల్ డిపార్ట్‌మెంట్, ఎస్టేట్, ఫైనాన్స్ డిపార్ట్‌మెంటు, వృత్తి శిక్షణా కేంద్రాలు, ఐటీ అధికారులతో సమీక్షా సమావేశంలో అన్ని విషయాలపై చర్చించారు. ఉద్యోగుల రికార్డ్స్, ఎస్టేట్ భూముల రికార్డ్స్, డిజిటలైజేషన్ చేయాలని ఆదేశించారు. ఉద్యోగుల కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలు కూడా పొందపర్చాలన్నారు. డిజిటలైజేషన్ ద్వారా ఉద్యోగుల వివరాలు తొందరగా తెలుస్తాయని చెప్పారు. కార్మికుల క్వార్టర్ల కేటాయింపులు, వసతులు కూడా రికార్డు చేయాలన్నారు. కోర్టు కేసులు కూడా అన్ని విషయాలు పొందపర్చాలన్నారు. అధికారులు త్వరితగతిన డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రంలో జీఎం సంజీవరెడ్డి, ఏజీఎం మురళీదర్, డీవైజీఎం అరవిందరావు, ఎంవీటీసీ మేనేజర్ రామారావు, ఎస్టేట్ ఆఫీసర్ వరలక్ష్మి, ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


